# తప్పెవరిది? చివుకుల పురుషోత్తం

“ఒకటి .... రెండు .... మూడు ....
... నాలుగు ... ఐదు ... ఆరు ...”

రఘు, ఆలాగా మాత్రలను, ఐదైదుగా చేర్చి చిన్న చిన్న కుప్పలుగా, టేబుల్ మీద లెక్క పెడుతున్నాడు. మూడురోజులుగా, రోజూ రాత్రిప్పుడు అలాగా లెక్క పెడుతున్నాడు.

కేవలం ముప్పై మాత్రలను లెక్క పెట్టడానికి మూడు రోజులు అవసరం లేనప్పటికీ, వాటిని మింగుదామా, వద్దా అన్న విషయం మటుకు తేలలేదు రఘుకు. మళ్ళీ మాత్రల నన్నింటిని కలిపివేశాడు. ఒకే గుట్టగా, మళ్ళీ వాటిని ఐదైదుగా, చిన్న కుప్పలుగా పెడుతున్నాడు.

సమయం రాత్రి ఎనిమిది గంటలైంది. మేడమీద ఉన్న ఒకే ఒక్క గదిలో రఘు కుర్చీ మీద కూర్చుని ఉన్నాడు. కుర్చీ కెదురుగా టేబుల్ ఉంది. టేబుల్ పైన గుట్టగా మాత్రలున్నాయి. గదిలో నలభై వాట్ల బల్బు వెలుగుతున్నది. కొంచెం దూరంలో మంచం ఉన్నది. దానిపైన పరుపు పరిచుంది. దానిమీద దిండూ, దుప్పటి ఉన్నాయి. మంచానికి నాలుగడుగుల దూరంలో కూజా. దాని ప్రక్కనే గ్లాసూ ఉంది.

రఘు, ఈ ప్రపంచంనుంచి వెళ్ళిపోదామనుకుని, అంతా సిద్ధం చేసుకున్నాడు. కాని ప్రయాణ ఘడియలు ఇంకా వచ్చినట్లు తోచలేదు రఘుకు.

“అన్నయ్యా! అమ్మ రమ్మంటుంది- అందరికీ భోజనాలు వడ్డించింది. త్వరగా రా”- అంటూ పదేళ్ళ రఘు తమ్ముడు, గది వాకిట్లో నుంచే అన్నాడు.

రఘు, చటుక్కున మాత్రలమీద చెయ్యి ఉంచి “రాము! నాకు ఆకలిగా లేదు. ఇందాకనే హోటల్లో టిఫిన్, కాఫీలు పడ్డాయి, ఒక స్నేహితుడు ఇప్పించాడు. పో. పోయి, అమ్మకు చెప్పు-తెల్లవారిందాకా నాకు ఏమీ వద్దని.”– అన్నాడు రఘు.

రాము వెళ్ళిపోయాడు.

రఘు మాత్రల మీద కప్పిన చెయ్యి తీశాడు. ఆలోచిస్తూ మళ్ళీ లెక్క పెడుతున్నాడు. ఆ మాత్రలను మూడురోజుల క్రితం తెచ్చాడు. మ్రింగడానికి ధైర్యం చాలలేదు. మ్రింగకుండా వుండడం అసాధ్యం! తన పట్టుదల తనకు తెలుసు. ఆ పట్టుదలే ఇన్ని అనర్థాలకు దారితీసింది, తను వీటిని మింగాలి. ప్రాణాలు పోగొట్టుకోవాలి. అదే అన్నింటికి పరిసమాప్తి.

తను, భవిష్యత్తును గురించి ఎన్ని కలలు కన్నాడు! అందమైన భార్య, చిన్న ఇల్లు. చక్కని సంసారం, మంచి ఉద్యోగం, వీటి కోసమై ఎన్నో కలలు కన్నాడు. అంతటి ఆనందమయమైన జీవితాన్ని సృష్టించుకోడానికి, తను ఎంత పట్టుదలగా కష్టించి చదివాడు? ఎంత పట్టుదలగా పరీక్షలు వ్రాశాడు? ఫస్ట్‌క్లాస్ తెచ్చుకొని. మంచి ఉద్యోగం సంపాదించాడు. ఎన్నో సంబంధాలు వచ్చినై. తనే మాళించాడు? చక్కని భార్య, హాయిగా సాగిపోయే సంసారం.

తను ఎంతోమంది దంపతులను పరిశీలించాడు. వాళ్ళు కీచులాడుకోవడం, చిన్న చిన్న కారణాలకే విడిపోవడం గమనించాడు. అలాంటివాళ్ళ జీవితాలను “ఎనలైజ్” చేసుకొని, వారి జీవితంలో దొర్లిన పొరబాట్లను విమర్శించుకొని, అలాటి పొరపాట్లు తన జీవితంలో రాకూడదని, వచ్చినా విజ్ఞతగా పరిష్కరించుకుందామని ఎన్నో నిర్ణయాలు చేసుకున్నాడు.

కానీ అవన్నీ తారుమారయ్యాయి. తను దారుణంగా మోసపోయాడు. ఎందుకిలా జరిగింది? తనను మోసగించిన వారిపై తన హృదయాన్ని గాయపరచినవారిపై చట్టబద్ధమైన చర్య తీసుకున్నాడు. అది తన తప్పా? తన తప్పు ఎంత మాత్రమూ కాదు.

ఈ విధంగా రఘు. తన తప్పు ఎంత మాత్రమూ కాదని అనుకున్నా, తప్పు నీదేనని తనలో ఎవరో ఘోషపెడుతున్నారు.

రఘు టేబుల్‌మీద ఉన్న పేపర్‌ను తీశాడు. ఎదురుగా పెట్టుకొని అందులో ప్రచురింపబడిన పెద్ద ఫొటో, దానికి క్రింద వ్రాయబడిఉన్న వార్తా మరోమారు చదివాడు. ఇప్పటికా వార్త కొన్ని వందల సార్లు చదివాడు. అయినా. ఆ వార్తలోని సెన్సేషనలిజం ప్రతి తడవ, అతని మనస్సును ఉద్రేకపరుస్తున్నది. ఆ వార్త ఇది:


“నిండు కుటుంబం దారుణ మరణం”

“కుటుంబరావుగారు, వారి భార్య, ముగ్గురు కూతుళ్ళూ, ఇద్దరు కొడుకులు, దారుణంగా ఆత్మహత్య చేసుకున్న ఉదంతం నేడు తెలియవచ్చింది. వారం దరూ “ఎండ్రిన్” త్రాగి ప్రాణాలు పోగొట్టుకున్నారు. కుటుంబరావుగారు వేయి రూపాయలపైన జీతం వచ్చే ఉద్యోగం చేసేవారు. ఆయన సంవత్సరం క్రింద పెద్ద కుమార్తె “రేణు” వయస్సు 22 కు పెండ్లి చేశారు. ఆ తరువాత జరిగిన కోర్టు వ్యాజ్యాలు... ....”

రఘు చటుక్కున పేపర్ టేబుల్ పైన విసిరివేశాడు.

“తప్పదు. ఇక తప్పదు” అనుకుంటూ దూరంగాఉన్న కూజాదగ్గరికెళ్ళి గ్లాసులో నీరుతీసుకొని, కుర్చీదగ్గరకొచ్చి. గుప్పెడు మాత్రలనునోటపోసుకొనిగ్లాసెడునీళ్ళనూ మెల్లి మెల్లగా త్రాగాడు. కుర్చీలో కూర్చున్నాడు. ఇప్పటికైనా ధైర్యం చేయగలిగినందుకు చిరునవ్వు నవ్వుకున్నాడు.

రఘు మళ్ళీ పేపర్ తీశాడు. ఫొటోవంక చూశాడు. బొమ్మలో ఒక గది లాటిది ఉంది, అందులో చాపలు పరువబడి వున్నాయి. అందులో కుటుంబరావు, అతని భార్య, పిల్లలూ అస్తవ్యస్తంగా చాపల మీద పడి వున్నారు.వారి నోళ్ళలో అంగుళంనుంచి, రెండు మూడంగుళాల వరకు నురగ. ఎత్తుగా వుంది. ముఖాలు గుర్తుపటడానికి వీలులేకుండా వున్నాయి. ఒక చివర ముగ్గురు స్త్రీల దేహాలు కనుపించినవి. వాళ్ళు కుటుంబరావు కూతుళ్ళని గ్రహించాడు రఘు. అందులో ఒకామె




కాళ్ళకు మెట్టెలున్నాయి. ఆమే తనభార్య అనుకుని ఫోటోను తడిమాడు రఘు.

అవును. ఆమెయే తన భార్య! రేణు! రేణూ బి. ఏ.! తనకు కాపురం చేయని భార్య తనతో విడాకులీయని భార్య. ఇష్టం లేకపోయినా తనచేత తాళి కట్టించుకొని, పదిమంది ముందూ ఏడడుగులు తనతో నడిచి శోభనం గదిలో తనతో ఒక్క అడుగూ వేయని ఆధునిక యువతి. తనపై అసహ్యాన్ని పెంచుకొని, తన జీవితాన్నే అన్యాయం చేసిన ఆమె. ఆధునిక ఆదర్శాలకు బానిసమె. పాటించే తెగువ, కాదనుకునే ధైర్యంలేక, తన బ్రతుకుని పాడుచేసుకొని. అందరి మృత్యువుకూ కారణమైన విద్యావతి, రేణు.

సంవత్సరం క్రింద తను పెండ్లిచూపుల కెళ్ళాడు రేణు, ఇంటికి అత్యంత ఉత్సాహంగా చేతిలో రేణు ఫొటో ఉంచుకుని. రేణు ఎంత అందంగా ఉంది? రేణుకు బాగా పాటలు పాడడం కూడా వచ్చునట! అయితే, సిగ్గువల్ల పాడలేకపోతున్నదన్న కుటుంబరావు మాటలు విని. తనే, పాడనక్కర్లేదు అన్నాడు. పెండ్లి చూపులు జరిగిపోయాయి. రేణు, తన వంక కన్నెత్తి ఒక్క మారైనా చూడలేదు. రేణు అంత సిగ్గు ప్రదర్శించినందున. కొద్దిగా చికాకు గల్గినా, తరువాత అది చాలా మంచి లక్షణం అనుకున్నాడు తను.

అన్నింటికంటే సంతోషాన్నిచ్చేదేమంటే. తన ఫొటో చూసి. చాలా బాగున్నాడని చెప్పిందట రేణు. అంతకు ముందే నెల రోజుల క్రింద, తన పెద్దనాయన కొడుకుతో రేణుకు పెండ్లి చూపులు జరిగాయి. వాడొక యం. డి. డాక్టరు. రెండువేల రూపాయల జీతగాడు. కానీ వాడు రేణుకి నచ్చలేదట! అవును! వాడు ఏ పిల్లకు మాత్రం నచ్చుతాడు? సన్నగా ఒక్క పీచులాగా ఉండేవాడ్ని ఏ ఆడపిల్ల వరిస్తుంది?

ఆ తరువాత కుటుంబరావు తమ సంబంధం మాట్లాడాడు. తన ఫొటో చూడగానే రేణు తనకు నచ్చిందని చెప్పినప్పుడు ఎంత సంబరపడ్డాడు! తన రూపురేఖలూ, పర్సనాలిటీ నచ్చి ఉంటుందనుకున్నాడు. అవును! ఆడపిల్లలు చాలా అడ్వాన్సుగా ఉన్నారీ రోజుల్లో, కేవలం సంపాదనను, గమనించడంలేదు వాళ్ళు - అని మెచ్చుకున్నాడు. రేణును జీవితాంతం, పూలలో పెట్టి పూజించుదామనుకున్నాడు - తన విలువ, రేణూ, సరిగా అంచనాకట్టినందుకు. తన ప్రాణాలైనా ధారపోసి రేణును ఆనందడోలికలలో ఊపుదామనుకున్నాడు.

పెండ్లి చూపులు అయిన రెండో రోజుననే, కుటుంబరావు తమ ఇంటికొచ్చి రేణు తనకు నచ్చిందని చెప్పాడు. ఇంట్లో అంతా సంతోషించారు. తను రేణు ఫొటోను గుండెలమీద పెట్టుకొని. ఈ గదిలోనే, ఊహాలోకాల్లో విహరిస్తుంటే మేడ క్రింద కుటుంబరావు, తన తండ్రీ, కట్నకానుకలు చర్చించుకొని, ఒక అవగాహన కొచ్చారట.

పది రోజులలో పెండ్లి ముహూర్తం వుంది. దాన్నే నిర్ణయించారు. ఆ తరువాత పెండ్లిరోజుదాకా తను, చాలా మథనపడ్డాడు. క్షణం ఒక యుగంలా గడిచింది. పెండ్లిరోజు ఎలాగో వచ్చింది. తనకు రేణు ముఖం తప్ప ఆ రోజు మరేమీ కన్పించలేదు. కలలోలాగ. పెండ్లి తంతు జరిగిపోయింది.

శోభనం రాత్రి వచ్చింది. తను ఇన్నాళ్ళుగా ఎదురు చూసిన మధుర క్షణాలు. పెద్ద ముత్తైదువులు తనను శోభనం గదిలోకి పంపారు. తను గదిలోకెళ్ళి మంచం మీద కూర్చున్నాడు. పెద్ద పట్టె మంచం మీద పరుపు పరిచి. దానిపై తెల్లని దుప్పటి కప్పి, దుప్పటి నిండా మల్లెపూలు చల్లారు. మంచానికి నాలుగువైపులా నిటారుగా మల్లెమాలలు వ్రేలాడుతూ ఘుమ ఘుమ లాడుతూ వున్నాయి. మంచానికి ప్రక్కగా టేబుల్‌పైన రకరకాల స్వీట్సు, పండ్లూ, పాలు ఉన్నాయి. ఒక లోటాలో ఒక కట్ట ఊదువత్తులు కాలుతూ, కమ్మని సువాసనల పొగలను గదినిండా నింపాయి.

తను మంచంమీద కూర్చుని, మల్లెపూలదండ నొకదానిని, పట్టుకొని, అసహనంగా, నలుపుతున్నాడు, రాత్రి పదకొండు గంటలైంది. ఎంతకీ రేణుని పంపరు.

గది వెలుపల ఘర్షణపడుతున్నట్టు మాటలు వినబడుతున్నాయి. తను మంచం దిగి, పిల్లి అడుగులు వేసుకుంటూ, చేరవేసిన తలుపు చాటున నిలబడి, బైట జరిగేదాన్ని వింటున్నాడు.

"లోపలికి పోవే!" ఎవరిదో ఆడ గొంతు. బహుశ అత్తగారిదే.

"నేను పోను!" రేణు గొంతు, 'ఎంత సిగ్గు'? అనుకున్నాడు తను

"మా పరువు గంగలో కలపదలచుకున్నావా?" మళ్ళీ అత్తగారే.

".... ....' సమాధానం లేదు రేణు నుంచి.

"చెబుతూంటే నీకుకాదూ?" కంఠంలో తీవ్రత

"నేను చచ్చినా లోపలకిపోను" రేణు కంఠంలో సిగ్గు తోచలేదు తనకు.

ఇంతలో గంభీరంగా ఒక గొంతు వినబడింది. అది కుటుంబరావుదే, "నీవు చచ్చినాసరే ! లోపలి కెళ్ళాల్సిందే.... ఊఁ....నడు."



అడుగుల చప్పుడు దగ్గరౌతుంటే తను చివాలున మంచం దగ్గర కెళ్ళి దాని మీద కూర్చున్నాడు. ఇంతలో తలుపు బార్లాగా తెరుచుకుంది. రేణు అతివేగంగా గదిలో కొచ్చి పడబోయి, నిలద్రొక్కుకుంది. ఎవరో బహుశః కుటుంబరావే. రేణును గదిలోపలకి బలవంతంగా త్రోసినట్లూ హించాడు తను.

ఒక్కసారి తన ఉత్సాహం అంతా నీరు గారి పోయింది. ఇలా పది మందికి తెలియడం. రేణుకు సిగ్గూ, మంకుతనం, మోతాదుకు మించి ఉండడం. రేణును బలవంతంగా గదిలోనికి నెట్టడం చూసిన తనకు ఒళ్ళంతా జలదరించింది. తనొక సినిమాలో విలన్‌లాగా. కుటుంబరావూ ఆయన భార్యా, తన రౌడీ నౌకర్లలాగా, రేణూ ఒక నిస్సహాయ అయిన ఆడపిల్లగా తోచి. ఒళ్ళంతా అసహ్యంతో నిండి పోయింది,

ఒక్క క్షణం. ఎటన్నా పారిపోయి. తలను తనకు కూడా కనబడనిచోట దాచుకుందా మనిపించింది ఈ పెండ్లి తంతు మొదలయ్యాక ఆచారాల పేరిట, ఈ పెద్దలు జరిపే న్యూసెన్సు తతంగానికి అనేకసార్లు చిరాకుపుటుకొచ్చింది, తనకు.

అయినా-ఇదే ఆఖరు ఇక ఏమి ఎవ్వరూ ఏ విషయంలోనూ బలవంతం చేయరు. ఈ న్యూసెన్సు తతంగాలకు ఇదే ఆఖరు ఘట్టం అనుకుంటూ, తను రేణు వంక చూశాడు. పెండ్లిచూపుల దగ్గరనుంచి. ఈ క్షణం వరకూ క్రీగంటనైనా తనవంక రేణు చూడకపోవడం తనకు చాలా బాధ కలిగింది. ఏంటో-ఈ ఆడపిల్లల నర్థం చేసుకోడం మహాకష్టం. ఎంత చదివినా, ఎన్ని లెక్చర్లిచ్చినా-ఇలాటి సమయాల్లో, ఇంతింత సిగు ఒలకపోసే ఆడపిల్లలను తలుచుకొని చిరాకుపడ్డాడతను. తనకు గుర్తొచ్చింది. తను మగవాడు. అంటే-తనే ముందు చొరవ తీసుకోవాలి. ఏ ఆడపిల్ల అయినా ఒక మూవ్‌మెంటు లేవదీయ కూడదూ? శోభనం గదిలో మొదట ఆడపిల్లే చొరవ తీసుకోవాలని?

తన అయిడియాకు తనే నవ్వుకుంటూ మెల్లగా వెళ్ళి రేణు భుజంమీద చేయి వేశాడు. రేణు ముడుచుకునిపోయి దూరంగా నిలబడంది. మళ్ళీ తనే రేణు దగ్గరకెళ్ళి భుజంమీద ఒక చేయి వేసి రెండో చేత్తో రేణు గడ్డాన్నిపట్టుకొని ముఖం పైకెత్తబోయాడు. రేణు తన చేతులను విదిలించి పారేసి. ఇంకా దూరంగా జరిగింది. తన మనస్సు చివుక్కుమంది. ఎంత సిగ్గైనా ఇంత మొరటుదనం పనికిరాదనుకున్నాడు మళ్ళీ రేణు చేతిని పట్టుకొని తన దగ్గరకు లాక్కోబోయాడు. రేణు తన చేతిని మెలిత్రిప్పి తనపట్టు సడలించుకొంది

ఆశ్చర్యంగా చూశాడు తను రేణువంక రేణుకు సిగు మోతాదుకు మించి ఉన్నట్లు తోచింది. వెంటనే, ఆవేశంగా. ఆమెను రెండు చేతులలోకి ఎత్తుకొని తీసుకువచ్చి మంచంమీద పడుకోబెట్టాడు. రేణు తన చేతులతో పెనుగులాడి మంచంమీద పడుకోబెట్టగానే, చివాలున మంచం దిగి నిలబడింది. రేణుకు ప్రక్క తను మంచంమీద కూర్చుని ఆశ్చర్యంగా రేణుతో అన్నాడు.

"రేణూ! ఏంటీ మొరటుతనం! నీవు చదువుకున్నదానవు! మరీ ఇంత సిగ్గేమిటి?"

"...............".

"చెప్పు రేణూ!" తను రెట్టించాడు.

"...............".

"నేనంటే నీకిష్టం లేదా?"

రేణు మౌనంగా తలవంచి. ఒక్కసారి-మొదటిసారిగా తన కళ్ళల్లోకి చూసింది. అబ్బ! ఆ చూపులో ఎంత అసహ్యం? ఎంత క్రోధం? ఎంత నిస్సహాయత? ఎంత భీతి?

"చెప్పు రేణూ! నేనంటే నీకు ఇష్టం లేదా? నా పైన ప్రేమ లేదా!"


"ప్రేమ! హుం! ఏడువేలకు పెళ్ళి కట్నం తగ్గినా, ఒప్పుకోని వాడికి ప్రేమ కావలసివచ్చిందా?!"

తనకు తల తిరిగిపోయింది! గిన్నెడు పాలలో విష బిందువు చిలికినట్లైంది. మనసు. నోరూ చేదుగా అయిపోయాయి.

తనూహించిన ప్రేమమయి భార్య ఏది? తను అనురాగంతో గుండెలలో దాచుకొన్న సుందరి ఏది? ఎవరీ నూతన వ్యక్తి?

"కట్నం తీసుకున్నానని కోపం వచ్చిందా?" అడిగాడు తను.

రేణు తలఎత్తి తన కళ్ళలోకి చూసింది. మై గాడ్! ఆ కళ్ళల్లోనుంచి వింత జుగుప్స. వింత వికారం ప్రవహించి తన పంటిని తాకింది. తన ఒళ్ళు దురదగొండి ఆకుతో నలుగుపెట్టినట్లైంది.



"రేణూ! అసలు నేను కట్నాల గొడవ పట్టించుకోలేదు. నిజంగా నాకేం తెలీదు, మీ నాన్న ఏమిచ్చాడో మా నాన్న ఏం తీసుకున్నాడో నాకసలు పట్టలేదు. కట్నం ఇచ్చి పెండ్లి చేసుకోవడం నీకిష్టంలేదా?" అని అడిగాడతను.

రేణు మౌనంగా తల దించుకొనే వుంది.

"మా పెద్దనాన్నగారి అమ్మాయి నీకు నచ్చలేదని, నా ఫోటో చూడగానే నచ్చాననీ విని ఎంత సంతోషించానో తెలుసా?"

"ఇందులో నచ్చే ప్రసక్తిలేదు ఆ డాక్టర్ గారు ఇరవై వేలు కట్నం అడిగారు. మీరు ఏడువేలకే వచ్చారు. పంటాలువడి ఆ డబ్బును కూడదీసి ఇచ్చాం. పెండ్లైంది."

"అంటే- నేనంటే నీకు ఇష్టం లేదన్న మాట! కట్నం ఇచ్చి పెండ్లి చేసుకోవడం కూడా నీకు ఇష్టంలేదు. మరెందుకు పెండ్లి చేసుకున్నావ్?"

"పెద్దవాండ్ల బలవంతంవల్ల."

"ఇప్పుడు నిన్ను పెద్దలు బలవంతం చేసి గదిలోకి తోశారుగదా! బుర్ర వంచుకుని పెండ్లి తంతునంతా చేశావు. నోరు మూసుకొని ఈ తంతులోకూడా పాల్గొన రాదా?"

రేణు తలెత్తి తన్నొక చూపు చూసి మళ్ళీ తల వంచుకుంది మౌనంగా.

"పోనీ నీకే పెండ్లి ఇష్టం లేకుంటే. ముందే నాకు చెప్పి వుండవలసింది గదా. పోనీ ఒక చిన్న చీటి ముక్కైనా రాసి పంపినా, ఈ పెండ్లి ఆపేవాడను గదా? అంత ఇష్టం లేని పిల్లను పెండ్లి చేసుకోవలసిన కర్మ నాకు లేదే."

"మీరుగాకుంటే ఇంకొకడు ఎవరైనా మా వాళ్ళు నా పెండ్లికి ఏడువేలే ఇవ్వగలరు."

"రేణూ! నీవు చదువుకున్నదానివి. వ్యక్తిత్వం ఉన్నట్టుంది. ఎవరైనా ప్రేమించి పెండ్లి చేసుకోలేకపోయావా?"

"కనీసం మీ పెద్దలకైనా నచ్చచెప్పి పెండ్లి ఆపుకోలేకపోయావా? పెద్దలు చెప్పినట్లు బుర్ర వంచి మూడు ముళ్ళు వేయించుకొని ఇప్పుడిలా మాట్లాడడం న్యాయమా?"

"..............."

తను ఎంత మాట్లాడినా చెలంకొట్టిన రాయిలాగా మౌనంగా ఉంది రేణు. తను మళ్ళీ రేణు భుజంమీద చేయివేశాడు. రేణు చేతిని మళ్ళీ విదిలించికొట్టింది.

తనకు విపరీతంగా కోపం వచ్చి "ఛీ" అనుకుంటూ మంచం దిగి తలుపుతీసుకొని వాకిట్లో కొచ్చాడు.......

రఘు అమ్మ "ఏరా! రఘూ అన్నం తిననన్నావట?" అనుకుంటూ మేడ మీద గదిలో కొచ్చింది. రఘు కంగారుగా లేచి. అమ్మకు నచ్చచెప్పి కిందికి పంపించేశాడు.

కడుపులో మాత్రలు పని చేస్తున్నట్లున్నై. బాటలో వేసినా. మంటగా ఉంది భరించ గల్గినంతగా. అయినా హాయిగా ఉంది. కొద్దిగా దాహంగా ఉన్నట్లుంటే కూజాలోనుంచి ఒక గ్లాసు మంచి నీళ్ళు త్రాగాడు రఘు.

మళ్ళీ ఆలోచనలో పడ్డాడు రఘు.

తనకా మాత్రల ప్రభావం తెలుసు. ఇరవై నుంచి ముప్ఫై నిముషాలలో మత్తు ప్రారంభం అవుతుంది. అప్పుడు మెల్లగా నిద్రలోకి జారుకుంటే ఈ ప్రపంచాన్నుంచి దూరంగా వెళ్ళిపోవచ్చు. తనకు మళ్ళీ మరో ప్రపంచంలో. మెలకువ రాగానే. రేణు అక్కడా కనిపిస్తుందా?

అక్కడా. ఏడువేలు కట్నమిచ్చా నని. సతాయిస్తుందా? నవ్వుకున్నాడు రఘు

రావాలనుకుంటే ఈ క్షణం హాస్పిటల్



కెక్కితే తను బ్రతుకగలడు. కానీ ఎందుకు బ్రతకాలి? భవిష్యత్తును గూర్చి తాను కన్న బంగారు కలలన్నీ గాలిమేడలలా కరిగిపోయాయి. పెద్దలు ఆడిన పెండ్లి ఆటలో తను వరకట్నాన్ని కాంక్షించిన దుర్మార్గుడుగా చిత్రింపబడ్డాడు. తను బ్రతికినా ఆత్మహత్య చేసుకొన్న ఏడుగురి ముఖాలు తనను జీవితాంతం వెన్నాడుతాయి.... అంతే ...... వెళ్ళిపోవాలిందే. అలా అనుకుంటూ ప్రక్క సర్దుకుని మంచంమీద పడుకొని పైకిచూస్తూ ఆలోచించుకుంటున్నాడు రఘు.

పడుకుంటే కడుపులో సన్నగా, వేడిగా మంట ప్రారంభం అయింది. మళ్ళీ ఆలోచనలు ముసురుకున్నాయి.

తనావిధంగా శోధనం గది విడిచి ఇల్లు చేరుకొని వుంటే? తన జీవిత గమనమే మరోముఖంపట్టి వుండేది! ఇక జన్మలో రేణు ముఖం చూసేవాడుకాడు. కొన్నాళ్ళకైనా, రేణు శోధనంనాడు చేసిన పరాభవం మర్చిపోయి. హాయిగా బ్రతుకగలిగి వుండేవాడేమో? కానీ తను గదిలో నుంచి బయట కాలుపెట్టగానే, కుటుంబరావూ, అతని భార్యా జలగల్లాగా, తన కాళ్ళుపట్టుకొని వదలలేదు.

"బాబూ! మమ్మల్ని క్షమించు. మా అమ్మాయిని కూడా క్షమించు, నీవు ఇప్పుడిలా వెళ్తే మా పరువు బజారుపాలౌతుంది. తరతరాలదాకా ఈ ఇంటి ఆడపిల్లమీద, ఈ మచ్చ పడుతుంది. నాకింకా పెండ్లికాని ఆడపిల్లలిద్దరున్నారు. వాళ్ళకీ జన్మలో పెండ్లి కాదు." అంటూ కుటుంబరావు తన కాళ్ళను పెనవేసుకుని ఏడుస్తుంటే తనకు జాలి కలుగలేదు అసహ్యంవేసింది.

"నా దగ్గర ఏడిస్తే ఏముంది? పోయి మీ కూతురు దగ్గర ఏడవండి. ఆమెకు ఇష్టంలేని పెండ్లి చేశారట! నేను తాకితేనే మండిపడుతున్నది. నన్ను వదిలేయండి. ఏమిటీ బలవంతపు బ్రాహ్మణార్థం?" అంటూ వారిని తప్పించుకోబోతే. వారు వదలలేదు. కుటుంబరావు తనను బలవంతంగా ఒక కుర్చీలో కూలవేసి సైంధవుడిలాగా నిలబడ్డాడు. తను పారిపోకుండా.

ఇంతలో కుటుంబరావుల తగారుగదిలో కెళ్ళింది. పది నిముషాల అనంతరం తలకొట్టుకుంటూ వచ్చి. అల్లుడితో అంది. "ఈ మిడిమేలపు చదువులు వద్దుమొర్రో అంటే ఒక్కరైనా వినిపించుకున్నారా? ఇక యేడవండి!" అన్నది ఈసడింపుగా.

అంతదాకా తనను అనునయిస్తున్న కుటుంబరావు కోపంగా గదిలోకెళ్ళాడు. పెద్దపెద్ద అంగలువేసుకొని. ఆయన లోపలికెళ్ళిన మరుక్షణం రేణు ఏడ్పు — పెద్దగా — వినబడింది. దానితోబాటే గుద్దులు గుద్దిన చప్పుడూ, గాజులు పగిలిన చప్పుడూ వినబడింది. తనకు సిగ్గు అసహ్యం విపరీతమయ్యాయి. కుటుంబరావు, గదిలోనుంచి వచ్చాడు. వెనుకటి మర్యాద ఏం కనబడలేదు. తనను జబ్బ పుచ్చుకొని గదిలోకి లాక్కెళ్ళాడు. ఆయన వాలకం చూస్తే తననూ, రెండు నగిలించే వాడిలాగా ఉంది. కుటుంబం పరువు నిలబెట్టుకోడానికి, ఏమైనా చేయడానికి సంసిద్ధుడిలాగా ఉన్నట్లున్నాడు.

కుటుంబరావు తననలా లోపలపెట్టి. బయట గొళ్ళెం పెట్టాడు. రేణు రెండు చేతులతో ముఖం కప్పుకుని ఏడుస్తున్నది. ఆమె పూలజడ అంతా రేగి అస్తవ్యస్తంగా ఉంది. తలలో పూలన్నీ నేలను రాలి ఉన్నాయి.

ఏడుస్తూ కూర్చునిఉన్న రేణును చూస్తే జాలి కలుగడంలేదు. ఇంత రసాభాసను చేసిన రేణుపైన ద్వేషంపొంగుకొచ్చింది. తను వెళ్ళి రేణు చెయ్యి పట్టుకొని లేవదియబోయాడు. రేణు గుంజుకుంది. తనకు ఒళ్ళు మండిపోయింది. ఒక్కఊపున రేణుని చేయి పట్టుకొని, బలవంతంగా లాగి మంచం దగ్గరకీడ్చుకొచ్చాడు.

రేణు ఆశ్చర్యంగా తనను చూస్తూ మంచంమీద కూర్చుంది.

"రేణూ ఈ ఏడ్పులు, వేషాలు కట్టిపెట్టు. కట్నం ఇవ్వకుండా ఉండాలని నీకెంత ఉందో. దాని ప్రసక్తి లేకుండా మంచిపిల్లను చేసుకొని ఆదర్శంగా బ్రతకాలని నాకూ ఉన్నది. ఏం చేస్తాం? ఇద్దరం అప్రయోజకులం! నీవు స్వంతంగా మొగుడ్ని వెతుక్కోలేవు. నేనా భార్యను వెతుక్కోలేను పెద్దలు చెప్పినట్లు విని పెండ్లి చేసుకున్నాము. ఇంతవరకూ పెద్దలు చెప్పినట్లు విని, ఇపుడు ఆదర్శాలు. తెలివితక్కువ రా." అంటూ తను రేణూను బలవంతంగా మంచంమీద పడవేసి. ప్రక్కన పడుకున్నాడు. రేణు చివాలున మంచందిగి నిల్చుంది. తన కండ్లు నిప్పులు కురిశాయి. అయినా తమాయించుకున్నాడు.

మంచానికి ప్రక్కగా, వున్న తన సూట్‌కేస్ తీసి, అందులో కాగితం కలం తీసి. రేణు చేతికిచ్చి అన్నాడు తను.

"ఊ! రాసివ్వు. నాకీ భర్త అంటే ఇష్టం లేదనీ. బలవంతంగా ఈ పెండ్లి కొప్పుకున్నాననీ రాసివ్వు."

"అలా నేను రాసివ్వను".

"ఎందుకని?"

"... .... ...."

"రాసివ్వు. నీ కట్నం డబ్బులు నీ ముఖాన పారేస్తాం ఇంకా పదో పరకో చట్టప్రకారం రాబట్టుకో కానీ ఈ పొర్పు ఇలా జరుగడానికి వీలులేదు"

"నేను రాసివ్వను" అంటూ కాగితం, కలం అవతల పారేసింది రేణు.

"ఆఖరుసారిగా అడుగుతున్నాను. రాసిస్తావా? రాసివ్వవా?"

"నేను రాసివ్వను"

తనలో పశుత్వం ప్రవేశించింది.

"రేణూ నీ పద్ధతేం బాగాలేదు. కట్నం తీసుకోడం తప్పే! ఇవ్వడం తప్పే. అయితే తప్పు చేసేవారిలోనూ నీతి ఉంటుంది. వారిలోనే నీతి ఎక్కువగా ఉంటుంది. దొంగతనం చేయడం తప్పే. కానీ దొంగతనానికి బయలుదేరిన ఇద్దరు దొంగలు నీతిగా. న్యాయంగా తమ వాటాలను పంచుకొంటారు. మనమూ అలాగే వుండాలి. ఇప్పుడు నీవు నన్ను మోసం చేసి, భర్తగా నా హక్కును గౌరవించకపోతే, పరిణామాలు తీవ్రంగా వుంటాయి. అయితే రాసివ్వనంటావు?"

"ఉహుఁ! రాసివ్వను. నన్ను ముట్టుకోనివ్వను. కట్నాలు తీసుకొనే వాడంటే నాకు పరమ అసహ్యం!" అన్నది రేణు.

తను రేణు జడ పట్టిలాగి మంచంమీద పడేశాడు. రేణు మంచంమీద పడిపోయింది. తను ఆమెపై పడ్డాడు. రేణు బహు మొరటుగా పెనుగులాడింది. తనూ ఇంకా మొరటుగా, క్షణంలో ఆమె రెండు చేతులనూ వెనుకకు మెలిత్రిప్పి. ఒక కాలుతో ఆమె రెండుకాళ్ళనూ అణగత్రొక్కి, నిస్సహాయనుగాచేసి రేణుబుగ్గపైన ముద్దుపెట్టుకోబోయాడు. కానీ. ఆమె ముఖం దగ్గరయ్యే కొద్దీ ఏమిటో చెప్పరానంత అసహ్యం వేసింది. అంతే....... రేణును వదిలేసి ఛీత్కారం చేసుకుంటూ"

"ఛీ! ఛీ! నీలాటిదానివి. తాకడం కూడా అసహ్యమే." అనుకుంటూ తలుపు దగ్గర కొచ్చి తట్టాడు సూట్‌కేస్‌ను చేతబట్టుకొని. కుటుంబరావు తలుపుతీశాడు.

తను గదిబయట కాలు పెట్టగనే, కుటుంబరావు పాత రికార్డు పెట్టాడు, తను మొరటుగా కుటుంబరావును ప్రక్కకుతోసి వెళ్ళబోయాడు.

కుటుంబరావు కాళ్ళమీద పడ్డాడు,మళ్ళీ.

"ఏమండీ! కట్నం ఇవ్వడం మీ అమ్మాయికి ఇషం లేకపోతే మా కెందుకు చెప్పలేదు? నా ఫొటో చూసి మీఅమ్మాయి మూర్ఛ పోయిందని ఎలా అబద్ధాలు చెప్పారు?" అన్నాడు తను.

"ఏదో బాబూ, జరిగిపోయింది."

"మా నాన్న కట్నం ఇవ్వమని బాధించాడా?"

"అదేం లేదుబాబూ! నేనే అయిదు వేలిసా నన్నాను. వారు పది అడిగారు. అంత ఇవ్వలేనని, ఏడు వేలైతే ఇవ్వగలనని రాశాను, వారు ఒప్పుకున్నట్టు రాశారు,"

"ఏవీ? ఆ జాబులిలా పట్టండి."

కుటుంబరావు పరుగుపరుగున పోయి జాబులు తెచ్చిచ్చాడు. తను ఆ మూడు జాబులూ జేబులో పెట్టుకొని అన్నాడు.

"కుటుంబరావుగారు మీ అమ్మాయికి నామీద ఇష్టం లేకున్నా వున్నట్టు అబద్ధం చెప్పారు. ఇప్పుడామెకు నా మీద ఇష్టం లేనట్టు తేలిపోయింది. అందుకని విడాకులకు దావావేస్తాను. విడాకులు కోర్టులో శాంక్షన్ అయ్యేలాగున మీ అమ్మాయిచేత కూడా ఒప్పుదల పత్రం ఇప్పించండి. మీకు రావలసిన కట్నం డబ్బులు, వగైరాలు. మీకు మా నాన్నచేత ఇప్పిస్తాను. కనుక వారంలోపల అలా చేయండి. లేకుంటే జీవితాంతం మీరు కుమిలి చచ్చేలా చేస్తాను. మోసంచేసి పెండ్లి చేశారు. దానికి ప్రాయశ్చిత్తంగా ఇది చేయండి" అంటూ, అందరు అడ్డాలు పడినా మొరటుగా అందర్నీ తొలగదోసుకొని, తన ఇంటికొచ్చాడు.

తను ఇంటికొచ్చాక నాన్నతో చాలా ఘర్షణపడ్డాడు. కుటుంబరావు తన తండ్రి పేరన వ్రాసిన మూడు జాబులూ దొరకపుచ్చుకున్నాడు. తనేం చేయాలో నిర్ణయించుకున్నాడు.

రఘుకు కడుపులో మంట జాస్తి అయింది. నాలుక లాగుకొనిపోతున్నది. మంట ఎక్కువయ్యేకొద్దీ కాళ్ళూ, చేతులు మెదడులోనికి నీరసం, ఒక విధమైన సౌఖ్యం వ్యాపిస్తున్నది. మెల్లగాలేచాడు, మంచినీళ్ళు త్రాగుదామని. పడబోయినాడు. అయినా నిలద్రొక్కుకుని కూజాలోని మంచినీళ్ళు త్రాగాడు. గుండె వేగంగా కొట్టుకుంటున్నది. ఏదో చెప్పరాని భయం, ఆందోళనా పట్టుకున్నాయి.

మెల్లగా మంచంమీద పడుకున్నాడు. వాచీ చూసుకుంటూ గుండెను తాకి చూసుకున్నాడు. సెకండ్ల ముల్లు పది సెకండ్లు కదిలేప్పటికి. ఇరవై ఒక్కసార్లు గుండె కొట్టుకున్నది. అంటే నిముషానికి నూట ఇరవై సార్లు కొట్టుకుంటుందన్నమాట. మళ్ళీ ఆలోచనలో పడ్డాడు రఘు.

ఈ క్షణానైనా తను తల్పుకుంటే నాన్నను కేకేసి, హాస్పిటల్‌లో అడ్మిట్ అయి, బ్రతుకగలడు. కానీ ఏం లాభం?....

తను చెప్పినట్టుగా వారంలోగా, రేణు విడాకుల ఒప్పుదల పత్రం పంపినా లేక శోభనం గదిలోని ప్రవర్తనకు, క్షమాపణచెప్పి. కాపురానికొచ్చినా ఎంత బాగుండేది? కానీ, రేణు మొండిఘటం. అలా ఒకనెల చూసి తను పోలీస్ కంప్లెయింట్ ఇచ్చాడు. కుటుంబరావూ, తన తండ్రి కట్నాలు ఇచ్చిపుచ్చుకొని పెండ్లి చేశారని అది నేరమనీ, తన భార్యకు ఇష్టం లేకపోయినా. పెండ్లి జరిపించారని, ఫిర్యాదు చేశాడు. పోలీసులు ఎంక్వయిరీకొచ్చారు. తమ స్టేట్‌మెంటు ఇచ్చి తన తండ్రి, కుటుంబరావులు రాసుకున్న జాబులకు ఫొటో కాపీలుతీసి పోలీసులకిచ్చాడు. తన తండ్రి లబ్బున మొత్తుకున్నాడు. తెలిసిన వాళ్ళచేత చెప్పించి, కేసు లేకుండా, చేసుకుందామని చూశాడు. కానీ తను ఇంకా పై అధికారులకు ఫిర్యాదు చేయడంవల్ల, నాన్న ప్రయత్నాలు ఫలించలేదు. విధిలేక పోలీసులు, కోర్టులో కేసు దాఖలు చేశారు.

కేసు కొన్ని నెలలు నడిచాక, రేణును తీసుకొని వచ్చి తన కాళ్ళమీద పడవేశాడు కుటుంబరావు. కానీ, తను కఠిన పాషాణంగా ఉండిపోయాడు. తను విడాకులు కోరాడు. వారు దానికి ఒప్పుకోలేదు. కేసు నడుస్తూంది.

రఘుకు కడుపులో మంట ఎక్కువగా ఉంది. ఉచ్ఛ్వాస నిశ్వాసల వేగం అధికమైంది, మంచినీళ్ళు తాగుదామనే కోర్కె ఒకవైపు లాగుతుంటే, మత్తు ఇంకో ప్రక్కనుంచి అదే బలంతో లాగుతున్నది. ఈ రెంటి నడుమ అలాగే పడుకొని వున్నాడు లేవలేక,

కుటుంబరావుకూ, తన తండ్రికి ఆరు నెలలు కఠిన కారాగారశిక్ష పడింది. ఆంధ్ర దేశ చరిత్రలోనే గాక, యావద్భారత చరిత్రలో ఇలాటి కేస్ మొదటిదైనందున, జడ్జి దయదలచి, ఐదువేల రూపాయల జరిమానాను విధించలేదు. తననూ ఇరికించాలని చూశారు. కానీ కేసును వెలుగులోకి తెచ్చింది, తనేగనుక, తనను వదిలివేశారు.

కుటుంబరావు, తన తండ్రి జైలుశిక్ష అనుభవించి వచ్చారు. జైలుశిక్ష అనుభవించినందున కుటుంబరావుకు ఉద్యోగం పోయింది. ఇన్నాళ్ళుగా జరిగిన ప్రచారం వలన కుటుంబరావు కుటుంబం తలఎత్తుకుని తిరుగలేకపోయింది. తరువాత. తరువాత, తిండికి జరుగడం కష్టం అయిపోయింది. అందుకే, వారు ఆత్మహత్య చేసుకున్నారు.

తనకు శోభనం గదిలో జరిగిన పరాభవానికి. కచ్చ తీర్చుకున్నాడు. కానీ. వారి కుటుంబం ఇలా ఆత్మహత్య చేసుకుంటుందని. తను ఊహించలేదు. ఇంతమంది మరణానికి తను కారకుడౌతాడని ఊహించలేదు. అయినా ఏ చట్టం తనను శిక్షించబోవడంలేదు; అందుకే తనను తాను శిక్షించుకుంటున్నాడు.

ఇంతకీ తప్పెవరిది? ఐదు వేలు కట్నం ఇస్తానని ఇంటికొచ్చిన కుటుంబరావుదా? పదివేలు కావాలని అడిగిన తన తండ్రిదా? ఏడువేలకి బేరం సరిచేసిన మధ్యవర్తులదా. కట్న కానుకల సంగతి పట్టించుకోక పెండ్లి కూతురి ఫొటో అందించిన లగాయితు ఆ ఫొటోను పట్టుకొని ఊహాలోకాల్లో విహరించిన తనదా? కట్నం ఇవ్వడం ఇష్టంలేక అయినా తప్పక కట్నం ఇచ్చి. మూడు ముళ్ళు వేయించుకొని మొండికెత్తిన రేణుదా? ప్రస్తుతం నడుస్తున్న సాంఘిక ధర్మాన్ని గమనించక. సంస్కరణలు ప్రబోధించక చట్టం చేసి పడేసిన పెద్దలదా? ఎవరిది? ఎవరిది? ఎవరిది? తప్పు.. ఎ... వ... రి... ది....?

అతి తీవ్రంగా కొట్టుకుంటున్న రఘు గుండె వేగం తగ్గిపోయింది. తలలో ఆలోచనలు మాయమయ్యాయి. ఆయాసం తగ్గిపోయింది, మత్తుగా రఘు తల ఒక ప్రక్కగా వాలిపోయింది.

పదిహేను నిముషాల తరువాత గురక ప్రారంభం అయింది. మరో పదిహేను నిముషాలకు గురక ఆగిపోయింది.

గది అంతా నిశ్శబ్దంగా ఉంది. ★